నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 6 ఫిబ్రవరి 2024 | ADILABAD

కాప్రిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ట్రిపుల్ ఐటీ తనిఖీ

బాసర ట్రిపుల్ఐటీలో గదులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామారావు పాటిల్

బాసర, ఫిబ్రవరి 5 : బాసరలోని ట్రిపుల్ఐటీని సోమవారం స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పాటిల్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, కనీస వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. అత్యవసర సమయాల్లో తనను సంప్రదించాలని సూచించారు. ట్రిపుల్ఐటీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను దెబ్బ కొట్టాలి

రెండు నెలల్లోనే ఆ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

- కేసీఆర్ సర్కారు చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ ముందుకెళ్లాలి
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి
- మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమీక్షలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పిలుపు
- హామీలు నెరవేర్చడం చేతగాని ప్రభుత్వం దిగిపోవాలని డిమాండ్
- బుడ్డరఖాన్ రేవంత్‌ని చెప్పతో కొట్టాలి : సుమన్
- పార్లమెంటు ఎన్నికల్లో సత్తాచాటాలి : మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- కార్యకర్తలందరికీ అండగా ఉంటాం : ఎమ్మెల్సీ దండె విఠల్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 5 : ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా దెబ్బకొట్టాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మంచిర్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాలులో నిర్వహించిన మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారాన్ని నమ్మి ప్రజలు ఆ పార్టీని గెలిపించారని, ఇచ్చిన హామీలన్నీ అమలయ్యేలా దాకా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. 2014లో తెలంగాణ వచ్చేనాటికి టెన్త్, ఇంటర్ చదివే పిల్లలకు తెలంగాణ ఉద్యమ చరిత్ర అంతగా తెలియదని, వీళ్లంతా నేడు 25 నుంచి 35 ఏళ్ల వారయ్యారని, సోషల్ మీడియాలో వచ్చే దుష్ప్రచారమే ఎక్కువగా వీళ్లను ఆకర్షించిందని చెప్పుకొచ్చారు. కేవలం రెండు నెలల్లోనే కాంగ్రెస్ బండారం బయట పడిందని, ఆ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, తప్పు చేశామన్న భావనలో వారు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం రాగానే ఆరుగ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. ఇప్పుడేమో మాట మారుస్తున్నారని మండిపడ్డారు. దేశంలో మూడు రాష్ట్రాల్లోనే కాంగ్రెస్ అధికారంలో ఉందని, మరి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని ఎలా చేస్తారని ప్రశ్నించారు. ''తెలుగువాళ్ల ఆత్మగౌరవం అంటూ ముఖ్యమంత్రి అయిన ఎన్‌టీఆర్ ఎన్నో పనులు చేశారు. పేద ప్రజల కడుపునింపడానికి రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చారు. భూమిశిస్తు రద్దు చేశారు. మండల, జిల్లాపరిషత్‌లకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించారు. అయినా మూడోసారి ప్రజలు ఓడించారు. అబద్ధాలతో ప్రభుత్వాన్ని నడిపించలేరు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. అని చెప్పుకొచ్చారు. కేసీఆర్ సర్కారు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిందని, రాష్ట్రాన్ని ముందంజలో నిలిపిందని తెలిపారు. అయితే ఎన్ని పనులు చేసినా రెండేళ్ల ముందు నుంచే కాంగ్రెస్, బీజేపీలు కలిసి దుష్ప్రచారాలను చేశాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే అవసరం మాకు లేదని, హామీలిచ్చే ముందు ఆర్థిక స్థితిగతులు ఎందుకు చూసుకోలేదని, అప్పులుచేశారని పదేపదే చెబుతున్న మీరు ఈ 50 రోజుల్లో మీరు అప్పులు ఎందుకు తెచ్చారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, చేతగాకపోతే దిగిపోవాలని, సన్నాసులమని ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. మంచిరోజులు మళ్లీ వస్తాయని, సమర్థవంతంమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని, ప్రజాస్వామ్యం అంటే అధికారమే కాదు, ప్రతిపక్షం కూడా ఉంటుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి కారణాలను విశ్లేషించుకొని, వాటిని సవరించుకొని ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలు మనల్ని గెలిపించినప్పుడు ఎలా చూసుకున్నామో.. ఇప్పుడు కూడా అలాగే చూసుకోవాలని, వారి పక్షాన నిలబడి సేవలందించాలని సూచించారు. గడిచిన పదేళ్లలో మనం చేసిన అభివృద్ధిని వివరిస్తూనే.. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. జరిగిన పొరపాటు జరిగిపోయిందని, ఇకనైనా కష్టపడి ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

బుడ్డరఖాన్ రేవంత్‌రెడ్డిని చెప్పతో కొట్టాలి..

- బాల్క సుమన్

తెలంగాణను తెచ్చిన మహానాయకుడు, రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దిన కేసీఆర్‌ను పట్టుకుని బుడ్డరఖాన్ రేవంత్‌రెడ్డి ఇష్టంవచ్చినట్లు మాట్లాడుతున్నాడని, అతన్ని చెప్పతో కొట్టాలని, కానీ సంస్కారం అడ్డు వచ్చి ఆ పని చేయడం లేదని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటమితో భయపడాల్సిన అవసరం లేదని, గులాబీ జెండా పుట్టిందే తెలంగాణ కోసమని, ప్రతిపక్షంలో ఉండి కూడా ప్రజల కోసం కొట్లాడటానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆ 420 హామీలు నెరవేర్చాలని, ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న రేవంత్ రెడ్డి పదవిని బట్టి.. స్థాయిని బట్టి మాట్లాడాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏ నాయకుడిని పరుష పదజాలంతో దూషించలేదని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదని చెప్పుకొచ్చారు. ఉద్యమానికి వెన్నుపోటు పొడిచినా కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్షమించి వదిలేశామని, ప్రజాస్వామ్య స్ఫూర్తితో పద్ధతిగా పరిపాలన కొనసాగించామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రేవంత్ రెడ్డి అహంకారంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని, రైతుబంధు డబ్బులు అడిగితే కాంగ్రెస్ మంత్రులు రైతులను చెప్పతో కొడతామంటున్నారని, ఆటో డ్రైవర్లు తిన్నది అరగక ధర్నాలు చేస్తున్నారని అహంకారంతో మాట్లాడుతున్నారన్నారు. రైతుబంధు కోసం గత ప్రభుత్వంలో విడుదల చేసిన రూ. 7,700 కోట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి రాఘవ కన్‌స్ట్రక్షన్‌కి, కాంగ్రెస్ కాంట్రాక్టర్ల జేబుల్లోకి మలుపుకొని రైతుల నోట్లో మట్టి కొట్టారని విమర్శించారు. పరిపాలన గాలికి వదిలేసి ఆస్తులు సంపాదించుకునే పనిలో పడ్డారని, కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ ఖజానాపై గద్దల్లా వాలి దోచుకుతింటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలు నెరవేర్చలేక ప్రజల దృష్టిని మరల్చడానికి కేసీఆర్‌ను, బీఆర్ఎస్ నాయకులను తిడుతున్నారని, ప్రజల దృష్టిని మరల్చి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో కేంద్రం గానీ, పక్క రాష్ట్రాల వాళ్లుగానీ మన ప్రాజెక్టుల వైపు చూడాలంటేనే భయపడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టుల అధికారాలన్నీ కేంద్రం చేతుల్లోకి వెళ్లిపోయాయని, సాగునీరు లేక రాష్ట్రంలో క్రాప్ హాలిడే ప్రకటించేదుస్థితికి చేరుకుందని, పరిపాలన చేతకాక గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ కుటుంబ పాలన అని విమర్శించిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు వినోద్, వివేక్ ఎమ్మెల్యేలు అయ్యారని, ఇప్పుడు వివేక్ కొడుకు వంశీకి ఎంపీ టికెట్ ఇవ్వాలని చూస్తున్నారని, ఇది కుటుంబ పాలన కాదా అని ప్రశ్నించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్సీ దండె విఠల్

బీఆర్ఎస్ కార్యకర్తలందరికీ అండగా నిలుస్తామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడినంత మాత్రాన ఎవరూ కుంగిపోవద్దని, ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లాలని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం కలిసికట్టుగా పనిచేయాలని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం స్థానికసంస్థల ఎన్నికలు వస్తాయని, వాటికోసం కూడా ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నల్లాసు కాంతయ్య, మంచిర్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, బీఆర్ఎస్ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, తిప్పని లింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అత్తి సరోజ, పల్లె భూమేశ్, గోగుల రవీందర్‌రెడ్డి, సందెల వెంకటేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

చివరి వరకూ ప్రజల కోసమే పనిచేస్తా..

- మాజీ మంత్రి జోగు రామన్న
- కాప్రిలో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

కాప్రిలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, ఫిబ్రవరి 5: సర్పంచ్ స్థాయి నుంచి వచ్చానని, చివరి వరకూ ప్రజలతోనే ఉంటూ వారి కోసమే పని చేస్తానని మాజీ మంత్రి జోగు రామన్న స్పష్టం చేశారు. మండలంలోని కాప్రి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, పార్టీ జెండా ఆవిష్కరించారు. పార్టీ కార్యాలయంలోని వసతులను పరిశీలించి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జై తెలంగాణ, జై బీఆర్ఎస్ నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటమి గురించి బాధపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల ఆశీర్వాదంతో సర్పంచ్ నుంచి మంత్రి వరకు పని చేసిన తాను, వారి పక్షానే నిలబడతానని పేర్కొన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేవరకు ప్రభుత్వంతో పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్నెట్టి గోవర్ధన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, రైతుబంధు మండల కన్వీనర్ ఎస్.లింగారెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గణేశ్ యాదవ్, మాజీ సర్పంచ్ ఊశన్న, నాయకులు రాంరెడ్డి, పురుషోత్తం యాదవ్, ప్రభాకర్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు తలకొక్కుల రామన్న, బీఆర్ఎస్ కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి నేహ శెట్టి

నిర్మల్‌లో నేహాశెట్టి

- ఎల్వీఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన 'డీజే టిల్లు' ఫేమ్
- తరలివచ్చిన అభిమానులు..

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 5: 'డీజే టిల్లు' సినిమాలో రాధికగా అలరించిన సినీతార నేహా శెట్టి సోమవారం నిర్మల్‌లో సందడి చేశారు. పట్టణంలోని బస్‌డిపో పక్కన ఏర్పాటు చేసిన ఎల్వీఆర్ షాపింగ్ మాల్‌ను స్థానిక ఎమెల్యే మహేశ్వర్ రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, దుకాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నేహాశెట్టి మాట్లాడుతూ..రాష్ట్రంలో ఇప్పటి వరకు నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల్‌లో బ్రాంచ్‌లు ఉండగా నాలుగో బ్రాంచ్‌ను సోమవారం నిర్మల్‌లో ప్రారంభించినట్లు తెలిపారు. అతి తక్కువ ధరలకే అన్ని రకాల బ్రాండెడ్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇక సినీతార నేహాశెట్టి వస్తున్న విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో దుకాణం వద్ద బారులు తీరారు. పట్టణ సీఐ పురుషోత్తం గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. నేహాశెట్టి కొద్దిసేపు అభిమానులతో మాట్లాడారు. సెల్ఫీలు దిగారు. ఓ పాటకు డ్యాన్ చేశారు. నిజామాబాద్ ఎమెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజాకుమార్ రెడ్డి, మాజీ ఎమెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, అయ్యన్నగారి భూమయ్య, షాపింగ్ మాల్ నిర్వాహకులు పీ శివ ప్రసాద్, పీ ప్రణీత్ తదితరులున్నారు.

ఆగ్రహజ్వాల

- సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం
- కేసీఆర్‌పై వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ ఆగ్రహం

సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. పలుచోట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. గౌరవప్రదమైన సీఎం హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి గల్లీ లీడర్‌లా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చలేని పరిస్థితుల్లో సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేతపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. పాలన చేతకాని రేవంత్ రెడ్డితో పాటు ఇతర నాయకులు బీఆర్ఎస్ నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని తెలిపారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లిలో సభ నిర్వహించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను విమర్శించడం మినహా సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఎలాంటి హామీలు ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలితంగా జిల్లా ఎంతో అభివృద్ధి చెందడమే కాకుండా ప్రజల ఉపాధి మెరుగు పడిందని తెలిపారు.

బోథ్, ఫిబ్రవరి 5: బోథ్‌లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపు మేరకు సోమవారం బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తుల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పోరాటం చేసిన మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావును ముఖ్యమంత్రి విమర్శించడం సరికాదన్నారు. అసహనంతో సీఎం బీఆర్ఎస్ నాయకులపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ డీ నారాయణ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, ఆత్మ చైర్మన్ మల్లెపూల సుభాష్, బోథ్ తాజా మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, జాదవ్ రోహిదాస్, మహిపాల్, హరీశ్, కొడప విజయ్, సురేశ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమి పూజ

పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 5: మండలంలోని భీంసరి గ్రామంలో రోడ్డు పనులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. సర్పంచ్ మయూర్ చంద్ర, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల తరఫున పోరాడుతాం

- మోసపూరిత హామీలతో కాంగ్రెస్‌కు అధికారం
- ఇంద్రవెల్లి సభలో నియోజకవర్గానికి ఏం ఇస్తరో సీఎం చెప్పలేదు
- ఆదిలాబాద్ ఎంపీ సీటు గెలిచి తీరుతాం
- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్

దస్తురాబాద్,ఫిబ్రవరి 5 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ఖానాపూర్ నియోజకవర్గ ప్రజల తరఫున పోరాడుతామని ఖానాపూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల తరఫున కొట్లాడేది ఒక్క బీఆర్ఎస్ పార్టీనేనని అన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. 2 నెలలకే ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తున్నదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారిగా ఖానాపూర్ నియోజకవర్గానికి సీఎంరేవంత్ రెడ్డి వచ్చారని, కనీసం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదని మండిపడ్డారు. పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఈ నెల 8వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో రద్దయినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్తకూ బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సింగరి కిషన్, వైస్ ఎంపీపీ భూక్యా రాజు నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ సత్తన్న, మాజీ సర్పంచ్‌లు సురేశ్ నాయక్, శంకర్, మాజీ ఉప సర్పంచ్ మాణిక్ రావు, మండలాధ్యక్షుడు ముడికే ఐలయ్య యాదవ్, నాయకులు రమేశ్ రావు, కమలాకర్ గౌడ్, గంగన్న, రాజన్న, గోపి, నన్న రాజు, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌దే గెలుపు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 5: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపని ఖానాపూర్ నియోజవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలో లేనప్పటికీ పార్టీ బలంగా ఉందన్నారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని తెలిపారు. ఈ నెల 12న ఖానాపూర్‌లో నిర్వహించే నియోజకవర్గస్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి మాజీ మంత్రి కేటీఆర్ రానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కార్యకర్తలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ పోటీ శోభాబాయి, పార్టీ మండలాధ్యక్షుడు డోంగ్రే మారుతీపటేల్, వైస్ ఎంపీపీ పడ్వాల్ గోపాల్, మండల కోఆప్షన్ సభ్యుడు మీర్జా జిలానీ బేగ్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు అంజద్, మాజీ ఎంపీపీ కనక తుకారం, ఎంపీటీసీ కోవ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులను ఎంపిక చేస్తాం

ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

ఎదులాపురం, ఫిబ్రవరి 5: యువతకు ఉపాధి కల్పన కోసం సబ్సిడీ రుణాలను అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు చేస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. పీఎం విశ్వకర్మ యోజన పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని, నిరుద్యోగులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా, రేషన్ కార్డు,సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సీఎస్సీ సెంటర్స్, గ్రామ, వార్డు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తామన్నారు. పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషణ్ రాజు, సంక్షేమాధికారి రమేశ్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ శైలజ, అధికారులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

మర్రిచెట్లకు చెంతకు మెస్రం వంశీయులు

ఇంద్రాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

కెస్లాపూర్‌లో మర్రి చెట్టుపై ఝరిని పెడుతున్న మెస్రం వంశీయులు

- ఇంద్రాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు
- కెస్లాపూర్‌లో చెట్లపై గంగాజలం ఝరి భద్రం
- 9న అర్ధరాత్రి నాగోబాకు మహాపూలకు సన్నద్ధం

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 5: నాగోబా మహాజాతర కోసం మెస్రం వంశీయులు సోమవారం రాత్రి కెస్లాపూర్ మర్రి చెట్లవద్దకు చేరుకున్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కలమడుగు వద్ద గోదావరి నదిలోని హస్తలమడుగులో గత నెల 28న గంగాజలంతో బయల్దేరిన మెస్రం వంశీయులు సోమవారం మర్రి చెట్ల వద్దకు చేరుకున్నారు. ముందుగా ఉదయం వీరికి ఇంద్రవెల్లిలో స్థానిక మెస్రం వంశీయులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఇంద్రాదేవి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ గంగాజలం ఝరితో సోమవారం రాత్రికి కెస్లాపూర్ మర్రిచెట్లకు చేరుకున్నారు. గంగాజలం ఝరితో మెస్రం వంశీయులు మర్రిచెట్లకు చేరుకున్నట్లు నాగోబా పేన్ కొత్వాల్ తిరుపతి మెస్రం వంశీయుల పటేళ్లకు సమాచారం అందించారు. పవిత్ర గంగాజలం ఝరిని మర్రిచెట్ల ప్రాంతంలోని ఓ మోత్కాకు చెట్టుపై తెల్లని వస్త్రంతో కట్టి భద్రపరిచారు. కుటంబ సమేతంగా బసచేశారు. మంగళవారం రాత్రి మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్‌తోపాటు మెస్రం వంశీయుల పటేళ్లు మర్రిచెట్లకు చేరుకొని ఫిబ్రవరి9న నాగోబాకు నిర్వహించే మహాపూజలతోపాటు తూమ్(పిండప్రదానం)పూజల నిర్వహణపై చర్చించనున్నట్లు మెస్రం వంశీయుల పెద్దలు తెలిపారు. మర్రిచెట్ల వద్ద గంగాజలం ఝరితో నాలుగు రోజులు బసచేయనున్నట్లు పేర్కొన్నారు. 9న మర్రిచెట్ల నుంచి గోవాడ్‌కు నాగోబా జాతర కోసం చేరుకోనున్నారు. ఈ కార్యక్రమంలో మెస్రం కోసుకటోడ, పర్ధాంజీ మెస్రం దాదారావ్, కోసేరావ్ కటోడ, నాగోబా పేన్ కోత్వాల్ తిరుపతి, నాయక్‌వాడీ మెస్రం ధర్ము, కటోడ హనుమంత్‌రావ్, మెస్రం వంశీయులు గణపతి, కార్తీక్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆర్టీసీ బస్సు బోల్తా

-ఆరుగురుకి స్వల్ప గాయాలు

తాంసి(తలమడుగు), ఫిబ్రవరి 5: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని ఝరి చర్లపల్లి గ్రామాల మధ్య ఓ ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఆదిలాబాద్ బస్టాండ్ నుంచి ఝరి పూనగూడకు ప్రయాణికులతో బయల్దేరిన బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి పల్టీలు కొట్టింది. ప్రమాద సమయంలో డ్రైవర్, కండక్టర్‌తో పాటు మరో నలుగురు ప్రయాణికులు ఉండగా, వారందరికీ స్వల్ప గాయాలయ్యాయి. మూల మలుపు వద్ద ప్రమాదశాత్తు బస్సు బోల్తా పడిందని డ్రైవర్ తెలిపారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించారు. జడ్ప